

షాద్‌నగర్‌టౌన్: ఎన్నికల నిర్వహణకు సంబంధించి సూచనలు చేస్తున్న షాద్‌నగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కృష్ణ




చేవెళ్లలోని ఫరా ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఎన్నికల సామగ్రితో బస్సుల్లో వెళ్తున్న సిబ్బంది



మొయినాబాద్ :పోలింగ్ మెటీరియల్‌ను అమర్చుతున్న అధికారులు

# ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

- పోలింగ్ కేంద్రాలకు చేరిన ఈవీఎంలు, సిబ్బంది
- కేంద్రాల వద్ద బందోబస్తు కట్టుదిట్టం
- నియోజకవర్గంలో 255 పోలింగ్ కేంద్రాలు, 2,36,338 మంది ఓటర్లు



షాద్‌నగర్: ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్న అధికారులు, సిబ్బంది

షాద్‌నగర్‌టౌన్, నవంబర్ 29: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ తుదిఘట్టానికి చేరుకుంది. కట్టుదిట్టమైన బందోబస్తుతో ఎన్నికలను నిర్వహించేందుకు సంబంధిత అధికారులు, పోలీసులు సిద్ధమయ్యారు. గురువారం అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాటు పూర్తి చేశామని షాద్‌నగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటమాధవరావు బుధవారం తెలిపారు. ఎన్నికల పరిశీలకులు చంద్రకాంత్ కేడాంగే ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. 1150మంది సిబ్బందితో పాటు వందల సంఖ్యలో పోలీస్ సిబ్బంది ఎన్నికల నిర్వహణలో భాగస్వాములవుతున్నారు. మొత్తం 255 కేంద్రాల వద్ద శాఖపరమైన అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని మినీ స్టేడియంలో 255 కేంద్రాలకు సంబంధించిన ఈవీఎం, వీవీప్యాట్, ఇతర పరికరాలను ఎన్నికల సిబ్బందికి సమావేశం నిర్వహించి అందజేశారు. మినీ స్టేడియం ప్రాంగణంలో పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పేర్లను, రూట్లను బూత్ అధికారులకు వివరించారు. పోలింగ్ కేంద్రాలకు 200మీటర్ల వరకు రాజకీయ నాయకులు ఎలాంటి ప్రచారం నిర్వహించవద్దని సూచించారు. ఉదయం 7గంటల నుంచి నిర్వహించే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ పార్థసారధి, ఎంఈఓ శంకర్‌రాథోడ్, ఏసీపీ రంగస్వామి, పట్టణ సీఐ ప్రతాప్‌లింగం, వివిధ మండలాల ఎంపీడీవోలు, వివిధశాఖల అధికారులు, వైద్యాధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

**255 పోలింగ్ కేంద్రాలు, 2,36,338 మంది ఓటర్లు**

షాద్‌నగర్ నియోజకవర్గంలో 255పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 2,36,338మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,19,045మంది, స్త్రీలు 1,17,278మంది, ట్రాన్‌జెండర్స్ 15మంది ఉన్నారు.

**నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు**

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని షాద్‌నగర్ పోలీసులు తెలిపారు. అన్ని ప్రాంతాల్లో 144సెక్షన్ అమలులో ఉంటుందని, శాంతిభద్రతలకు, ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ఆటంకం కలిగించినా చర్యలు ఉంటాయన్నారు. పోలింగ్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఎలాంటి వాహనాలను నిలుపరాదని, గుంపులుగా జనాలు ఉండరాదని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో ఒక డీసీపీ, అడిషనల్ డీసీపీ, ఐదుగురు ఏసీపీలు, 11మంది సీఐలు, 7మంది ఎస్‌లు, పారామిలిటరీ 140 మందితో పాటు 420మంది పోలీస్ సిబ్బంది వీధులు నిర్వహిస్తున్నారని వివరించారు.

**సహాయకులుగా ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు**

షాద్‌నగర్ అసెంబ్లీ ఎన్నికల సహాయకులుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొననున్నట్లు ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎన్. రవీందర్‌రెడ్డి తెలిపారు. సుమారు 20మంది వలంటీర్లు ఎలక్షన్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ విభాగంలో సహాయకులుగా విధులు నిర్వహించనున్నారు. ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లను రిటర్నింగ్ అధికారి వెంకటమాధవరావు, తాసిల్దార్ పార్థసారధి అభినందించారు.

**మొయినాబాద్** : మండలంలో 28 గ్రామ పంచాయతీలు, 8 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. మండలంలో 65 పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కూ రెండు వెబ్ కాస్టింగ్‌ను ఏర్పాటు చేశారు. 6 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. మండలంలో 5 రూట్లు ఏర్పాటు చేశారు. 5 రూట్లకు ఒక సీఐ, ఒక ఎస్ఐ, 13 మంది కానిస్టేబుల్స్, 6 మంది ఆర్మీ జవాన్‌లు విధులు నిర్వహిస్తారు. 65 పోలింగ్ స్టేషన్‌ల వద్ద మొత్తం 70 మంది పోలీస్ సిబ్బంది, 30 మంది ఆర్మీ జవాన్‌లు విధులు నిర్వహిస్తారు. సమస్యాత్మక గ్రామాలైన పెద్దమంగళారం, చిలుకూరు, హిమాయత్‌నగర్, శ్రీరాంనగర్, బాకారం గ్రామాల్లో పోలీసులు గట్టి నిఘాను ఏర్పాటు చేశారు.

**నందిగామ** : అసెంబ్లీ ఎన్నికలకు నందిగామ మండల వ్యాప్తంగా ఎన్నికల అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నందిగామ మండలంలో రెండు రూట్లుగా ఏర్పాటు చేసి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నందిగామలో 6, మేకగూడ 2, నర్సప్పగూడ 2, రంగపూర్ 3, చేగూరు 6, వీర్లపల్లి 3, మామిడిపల్లి 2, మాజీద్‌మామిడిపల్లి 2, ఈదులపల్లి 1 పోలింగ్ బూతులను ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 39,283 మంది ఓటర్లు ఉన్నారు. 42 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, 50 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేసినట్లు సీఐ ఎన్.సురేశ్ తెలిపారు.



చేవెళ్లలో ఫరా ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ వద్ద మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి సాయిరాం

## 298 పోలింగ్ కేంద్రాలు.. 2,53,972 మంది ఓటర్లు

షాబాద్, నవంబర్ 29: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి చేవెళ్ల నియోజకవర్గంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం తెలిపారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలోని ఫరా ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం పోలింగ్ కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. మొత్తం నియోజకవర్గంలో 298 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఎన్నికల సామగ్రిని సిబ్బందికి అందజేశారు. మొత్తం 3500 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు.

**నియోజకవర్గంలో మొత్తం 2,53,972 మంది ఓటర్లు**

నియోజకవర్గంలోని షాబాద్, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, నవాబుపేట్ మండలాల్లో మొత్తం 2,53,972 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,28,773 మంది, మహిళలు 1,25,195 మంది, ట్రాన్స్ జెండర్స్ నలుగురు ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం 298 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఇందులో 57 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు గుర్తించారు.

**గట్టి బందోబస్తు...**

పోలింగ్ సందర్భంగా ఆయా మండలాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. చేవెళ్ల ఏసీసీ ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐదు మండలాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒక డీసీపీ, ఒక అడిషనల్ డీసీపీ, ముగ్గురు ఏసీపీలు, 9మంది సీఐలు, 14 మంది ఎస్ఐలు, నలుగురు ఏఎస్ఐలు, 42 మంది హెడ్ కానిస్టేబుల్‌లు, 193 మంది కానిస్టేబుల్‌లు, 92 మంది హోంగార్డులు, 24 మంది ఏఆర్ కానిస్టేబుల్‌లు విధులు నిర్వర్తించనున్నారు.



పోలీస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న పోలీసు అధికారులు




షాద్‌నగర్: ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు



చేవెళ్లలోని ఫరా ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఎన్నికల సామగ్రితో పోలింగ్ బూత్‌లకు తరలివెళ్తున్న సిబ్బంది

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.